తెలుగు మ్యూజియంపై నిర్లక్ష్యపు నీడ

- రవాణా సౌకర్యం లేక సందర్శకులు దూరం
- అధికారుల తీరుతో మూతపడిన వైనం


మ్యూజియంలో తెలుగుతల్లి, కవుల విగ్రహాలు


కైలాసగిరిపై తెలుగు మ్యూజియం

ఆరిలోవ: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై తెలుగు మ్యూజియం సందర్శకులకు దూరమైంది. తెలుగు కవులు, రాజులకు సంబంధించిన జీవిత విశేషాలు, విజ్ఞానం, వినోదాన్ని పంచిన మ్యూజియం వీఎంఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. సందర్శకులు దీని వద్దకు చేరలేని పరిస్థితి నెలకొనడంతో, సందర్శకులు లేక మూతపడింది. నగరానికి మణిహారంలా నిలిచిన కైలాసగిరికి రోజూ వందల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. కార్తీక మాసంలో ఆ సంఖ్య వేలల్లో ఉంటుంది. వారిలో చాలామంది కై లాసగిరిపైనే ఉన్న తెలుగు మ్యూజియంను సందర్శించేవారు. గతంలో ఇక్కడ బ్యాటరీ వాహనాలు ఉండటంతో సందర్శకులకు అనువుగా ఉండేది. ఇప్పుడు ఆ వాహనాలు నడపకపోవడంతో కొండపై ఎక్కువ దూరంలో ఉన్న తెలుగు మ్యూజియం వరకు నడవలేక సందర్శకులు వెళ్లడం లేదు.

కొండపై కై లాసగిరి ద్వారం ప్రారంభంలోనే శివ పార్వతుల విగ్రహాలు, పార్కులు ఉంటాయి. అక్కడ సరదాగా గడిపిన అనంతరం తెలుగు మ్యూజియంకు వెళ్లేవారు. కొండపై ప్రధాన ద్వారం (ఆర్చ్) నుంచి తెలుగు మ్యూజియంకు సుమారు కిలోమీటరుకు పైగా దూరం ఉంటుంది. అక్కడి వరకు తారు రోడ్డు నిర్మించారు. అంత దూరం నడవడానికి గతంలో బ్యాటరీ కార్లు ఉండేవి. దానిలో టిక్కెట్ చెల్లించి సందర్శకులు వెళ్లి వినోదం, విజ్ఞానం పొందేవారు. కొంతకాలంగా ఆ బ్యాటరీ కార్లు మరమ్మతులకు గురయ్యాయి. అప్పట్లో ఓ కారు ప్రమాదానికి గురై ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి బ్యాటరీ కార్లు నడపడం మానేశారు. సరికదా మరో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయలేదు. దీంతో అంత దూరంలో ఉన్న తెలుగు మ్యూజియంకు సందర్శకులు ఎవ్వరూ వెళ్లలేకపోడంతో ప్రస్తుతం మూతపడింది. కై లాసగిరిపై ఆర్చ్ నుంచి తెలుగు మ్యూజియం వరకు అధికారులు రవాణా సౌకర్యం కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.


కొండపై తెలుగు మ్యూజియానికి రోడ్డు

విజ్ఞానం.. వినోదాల సమాహారం


తెలుగు మ్యూజియంలో రొటేట్ చైర్స్ ఆడిటోరియం

కైలాసగిరిపై తెలుగు మ్యూజియం నిర్మాణానికి 2008లో శ్రీకారం చుట్టారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి దీన్ని నిర్మాణానికి కొండపై 6 ఎకరాల స్థలం కేటాయించారు. దానిలో 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మ్యూజియం నిర్మించారు. తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రూ.15 కోట్లతో దీన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న తెలుగువారిలో ఎక్కువ మంది విరాళాలు అందించారు. 2015 నవంబరు 15న సందర్శకుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నుంచి క్రీ.శ 20వ శతాబ్దం వరకు తెలుగు భాష, సంస్కృతికి కృషిచేసిన 64 మంది విగ్రహాలను ఈ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. సి.బి ఆర్ట్ డైరెక్టర్ తేజ్ తరణి ఈ విగ్రహాలకు రూపకల్పన చేశారు. ఇందులో 80 మంది కూర్చుని చూడడానికి వీలుగా రొటేట్ చైర్స్‌తో కూడిన ఆడిటోరియం ఏర్పాటు చేశారు. ఇది కంప్యూటర్ ద్వారా తిరుగుతుంది. దీనిలో తిరుగుతున్న సమయంలో ప్రతి విగ్రహం ఎదురుగా వెళ్లేటప్పుడు లైటింగ్ పడుతుంది. ఆ విగ్రహం గురించి సినీ యాక్టర్ సాయికుమార్ వాయిస్‌తో సందర్శకులకు వ్యాఖ్యానం వినిపిస్తుంది. దీంతోపాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల ప్రాముఖ్యత గురించి తెలిపే ఫొటోలు మ్యూజియంలో పొందుపరిచారు.

బంధువులకు చూపించలేకపోయాను



మేము ఆరిలోవలో ఉంటాం. తెలంగాణ నుంచి వచ్చిన మా బంధువులను తీసుకొని ఆదివారం కై లాసగిరికి వెళ్లాం. తెలుగు మ్యూజియం కూడా చూపిద్దామని, కిలోమీటరుకు పైగా నడిచి అక్కడికి వెళితే మ్యూజియం తెరవలేదని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. ఎక్కువమంది రాకపోవడంతో తెరవడం లేదన్నారు. దీంతో అంతదూరం నుంచి నిరాశతో తిరిగి వచ్చేశాం. కైలాసగిరి వెళ్లేముందు మా బంధువులకు ఈ మ్యూజియం గురించి ఎన్నో విశేషాలు చెప్పాను. కానీ చూపించలేకపోయాను.

– నిక్కిరాం నాయక్, ఆరిలోవ

నిరాశగా వెనక్కి వచ్చేశాం



కొద్ది రోజుల క్రితం మా పిల్లల్ని తీసుకొని కైలాసగిరికి వెళ్లాం. అక్కడ తెలుగు మ్యూజియం చూపించాలని వెళ్లినా.. తెరవడం లేదని తెలిసి మధ్యలోనే నిరాశతో తిరిగి వచ్చేశాం. విజ్ఞానం పంచే మ్యూజియం మూత పడకుండా చూడాలి. అధికారులు చొరవ తీసుకుని కైలాసగిరిపై తెలుగు మ్యూజియం వరకు రవాణా సౌకర్యం కల్పించాలి.

– కిలపర్తి మహేష్, విశాలాక్షినగర్

అధికారులు శ్రద్ధ చూపాలి



మ్యూజియంలో తెలుగు కవులు, ఆంధ్ర రాజ్యాన్ని పరిపాలించిన రాజులు జీవిత చరిత్రలు పిల్లలకు తెలియాల్సిన అంశాలు. నక్షత్రశాలలో రొటేట్ చైర్స్‌లో తిరుగుతూ మంచి వినోదం పొందుతారు. విజ్ఞానం, వినోదం పంచే ఈ మ్యూజియం నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపాలి. కనీసం మ్యూజియం ఎక్కడ ఉందో దారిని చూసే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రవాణా సౌకర్యం కల్పించి, మరింత ప్రచారం కల్పిస్తే పర్యాటకులకు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది.

– కె.కృష్ణ, ఆరిలోవ

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు అందరూ ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

- 11 మంది విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు


ఫీజులు చెల్లించిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్.వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 11మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను లయన్స్ క్లబ్ చెల్లించింది. ఆ మొత్తాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధి దుర్గాప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతకు సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహాయం అందించడంలో భాగంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.600 చొప్పున 11 మంది విద్యార్థులకు సంబంధించి రూ.6600 అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

1న హనుమ కల్యాణోత్సవం

ఎంవీపీకాలనీ: శ్రీరామ పంచాయతన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న శ్రీ సువర్చలా హనుమ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కోశాధికారి రామలింగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం కమ్యూనిటీ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సిగ్మా కంపెనీ అధినేత డాక్టర్ ఉలిమిరి వెంకట సోమయాజులు పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాశీపుర వాసి హాజరవుతున్నట్లు వెల్లడించారు.

టేబుల్ టెన్నిస్‌లో మెరిసిన గాయత్రి విద్యార్థులు

ఎంవీపీకాలనీ: టేబుల్ టెన్నిస్‌లో రాణించిన ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో కళాశాలలో పీజీ విద్యార్థి పీఎంసీ రవివర్మ, బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి పి.మహిధర్ వర్మ, ప్రథమ సంవత్సరం విద్యార్థి ఇ.సాయిగౌతమ్, బీబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎ.లోచన్, బీసీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి సాయి సుందర్ మిశ్రా విజేతలుగా నిలిచి ట్రోఫీని గెలుచుకున్నారు. మరికొంతమంది విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లోను సత్తా చాటారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ సోమవారం అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య పి.మోహిని, ఫిజికల్ డైరెక్టర్ పి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమత కళాశాలలో ఉచిత వైద్య శిబిరం


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని సమత కళాశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ విజయ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం కోసం విజయ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన


లైవ్ పోర్‌ట్రెయిట్ పెయింటింగ్ వేస్తున్న చిత్రకారుడు నరేష్

బీచ్‌రోడ్డు: సిరిపురంలోని డైస్ ఆర్ట్ గ్యాలరీలో సోమవారం ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంది. ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగం ఎంఎఫ్‌ఏ గ్రాడ్యుయేట్ జ్యోత్స్న మండపాక ఏర్పాటు చేసిన ఈ సోలో ఎగ్జిబిషన్‌లో పెయింటింగ్స్ వావ్ అనిపించాయి. యువ విద్యార్థుల కళాత్మక వ్యక్తీకరణలను ప్రదర్శించే 'ఐ కెన్ పెయింట్' 2వ ఎడిషన్ సృజనాత్మకత అద్భుతమనిపించింది. నగరానికి చెందిన కళాకారుడు నరేష్ మహంత లైవ్ పోర్‌ట్రెయిట్ పెయింటింగ్ చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 30వ తేదీ వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఏయూలో విజిలెన్స్ వ్యవస్థ పటిష్టం

వీసీ ఆచార్య శశిభూషణరావు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పారదర్శకతను పెంపొందించే విధంగా విజిలెన్స్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఏయూ ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై వర్సిటీలో టెండర్లు, కొటేషన్లు, సీపీసీలో ఉంచే ప్రతిపాదనల వంటివన్నీ విజిలెన్స్ అధికారి పరిశీలన, అనుమతితో మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగే ఆర్థిక లావాదేవీలు, విత్త నిర్వహణ విజిలెన్స్ అధికారి పరిశీలించి, వారి అనుమతి పొందిన తర్వాతే నిర్వహిస్తామన్నారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా కొనుగోలు చేసే పరికరాలకు విజిలెన్స్ అధికారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సివిల్, ఎలక్ట్రికల్ వర్క్‌లో నిర్వహణ, వస్తువుల కొనుగోలు తదితర అంశాలలో విజిలెన్స్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యుడు టి.చిట్టిబాబును విజిలెన్స్ అధికారిగా ఇప్పటికే నియమించామని, ఆయన అన్ని అంశాలను పరిశీలించి అనుమతులిస్తారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ విభాగాల్లో నిర్వహించే సదస్సులు, సమావేశాల ఫొటోలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పొందుపరచాలని వీసీ తెలిపారు. దీని కోసం ఏయూ కంప్యూటర్ సెంటర్ నిర్వహణలో సిబ్బంది పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్,అధికారులు, హాస్టల్ చీఫ్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణంపై కలెక్టర్, కమిషనర్‌కు ఫిర్యాదు


నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనం

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరా గాంధీ నగర్‌లో అనధికారికంగా చేపడుతున్న భవనం నిర్మాణంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇక్కడ సర్వే నంబరు 111లో 2/312/1 డోర్ నంబరుతో ఓ వ్యక్తి రోడ్డును ఆనుకొని నిర్మాణం చేపట్టాడు. జీవీఎంసీ నుంచి తీసుకున్న అనుమతులను మించి అనధికారికంగా నాలుగో ఫ్లోర్ వేశారు. భవనాన్ని ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మించారు. రోడ్డుపక్కన కాల్వలను మూసేసి, వాటిపైకి సన్‌షేడ్‌లు వచ్చే విధంగా నిర్మాణం చేపట్టారు. దీనివల్ల రోడ్డు ఇరుగ్గా మారుతోందని స్థానికులు కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్, కమిషనర్ స్పందించి చర్యలు చేపడతామన్నారని ఫిర్యాదుదారులు ఎ.విశ్వేశ్వరరావు, మంగతాయారు, అప్పలనాయుడు తదితరులు తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన, రాజనీతి శాస్త్ర విభాగం ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పొలిటికల్ సైన్స్ విభాగం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూజీసీ సూచించిన విధంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించామని, వీరికి బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్స్ ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్ రాజు, ఆర్. పద్మశ్రీ, డి.నగ రాజకుమారి, డీన్ పి.అరుణ్ కుమార్, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

అభిషేకప్రియుడికి నీరాజనం


గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో పసుపుతో అలంకరించిన శివలింగం


కొత్తవెంకోజీపాలెం శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


తులసి కోట వద్ద మహిళల దీపారాధన


పీతలవానిపాలెంలో శివాలయం వద్ద ప్రసాదాల వితరణ


ఆరిలోవ శివాజీనగర్-2 శివాలయంలో అన్నాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సునీత, భక్తులు

మద్దిలపాలెం: అభిషేక ప్రియుడికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మహా రుద్రాభిషేకం చేశారు. శివలింగాన్ని పసుపుతో అలంకరించి, పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించారు. కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ శివాలయాల్లో, ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరాలయంలో, పీతలవానిపాలెంలోని రాజరాజేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు. పీతలవానిపాలెం శివాలయంలో శ్రీకృష్ణ యువజనసంఘం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

మహాదేవుడికి అన్నాభిషేకం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ శివాజీనగర్–2 శివాలయంలో నిర్వాహకులు అన్నాభిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొని స్వామికి అన్నాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆపరేషన్ కాలనీ, శివాజీనగర్–2, నెహ్రూ నగర్, డ్రైవర్స్‌కాలనీ, కై లాసనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్ శివాలయాలు హర నామస్మరణతో మార్మోగాయి.

జోన్-3 పీజీఆర్‌ఎస్‌కు ఐదు వినతులు

సీతమ్మధార : ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఐదు వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ వీటిని స్వీకరించారు. జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టీపీవో గోవన్న, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం


దుర్గాభాయి దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య: మహిళల రక్షణకు రాజ్యాంగం దృఢమైన చట్టాలను రూపొందించిందని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం అన్నారు. వాటిపై మహిళలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. 'ఇంటర్నేషనల్ డే ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్' ను పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ న్యాయ కళాశాల, డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ కళాశాల సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించిన సింపోజియంలో ఆమె మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలకు అన్ని హక్కులు కల్పించబడ్డాయన్నారు. ఆ హక్కులను సాధించుకోవాలంటే చట్టాలు తెలిసి ఉండాలన్నారు. ఆచార్య చంద్రకళ, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్, సీనియర్ అడ్వకేట్ జహా ఆరా చట్టానికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సమగ్ర సంరక్షణ ప్రాజెక్ట్ ఏర్పాటుకు వినతి

మద్దిలపాలెం: సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా రోగుల వైద్యపరీక్షలకు సంబంధించి, కేంద్ర గిరిజన వ్యవహారాలు, మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయతలపెట్టిన సమగ్ర సంరక్షణ ప్రాజెక్ట్ (సీవోసీ)ని కేజీహెచ్‌లో ఏర్పాటు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కె.గణపతి కోరారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్రలో సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా రోగుల సంఖ్య అధికంగా ఉందన్నారు. దీనికి సంబంధించిన వైద్య పరీక్షలు, చికిత్స అందించేందుకు కేజీహెచ్‌లో సీవోసీ ఏర్పాటుకు అనుమతిస్తూ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ రూ.6 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో కేజీహెచ్‌ను కేంద్రంగా ఎంపిక చేయడం హర్షించదగిన విషయమన్నారు. అయితే ఆ కేంద్రాన్ని మంగళగిరిలోని ఎయిమ్స్‌కు మార్చాలని వినిపిస్తున్న వదంతుల నేపథ్యంలో కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి, వినతపత్రం అందించామన్నారు.


ఫోర్బ్స్ జాబితాలో 'తారమండల్'

- సభ్యులకు వీసీ అభినందన


అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి వినీల్ జడ్సన్ స్థాపించిన తారమండల్ టెక్నాలజీస్ స్పేస్ స్టార్టప్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ఫోర్బ్స్ ఇండియా సెలెక్ట్ 200 లిస్ట్ ఫర్ 2024కు ఎంపికైంది. ఈ సందర్భంగా తారమండల్ సభ్యులను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఫోర్బ్స్ ఇండియా డి గ్లోబలిస్ట్ 'సెలక్ట్ 200' జాబితాలో రాష్ట్రం నుంచి తారమండల్ ఒక్కటే స్థానం సాధించింది. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఆచార్య పి.మల్లికార్జునరావు, డి.రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖ మ్యూజిక్ అకాడమీ సంగీత సభలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు

మద్దిలపాలెం: కళాకారుల సేవలో తరిస్తున్న విశాఖ మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాన్ని మంగళవారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహించనుంది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా సంగీత సభల్లో సంగీత కళాకారులు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. మంగళవారం కోల్‌కతా పద్మావతి సారనాథ ఆధ్వర్యంలో (చెన్నై) గాత్ర కచేరి, బుధవారం వి.కె.మణి కుమార్ ఆధ్వర్యంలో గాత్ర కచేరి, 28న బెంగళూరుకు చెందిన ఎం. నాగరాజ్, డాక్టర్ మైసూర్ మంజునాథ్‌ల ఆధ్వర్యంలో వాయులీనం కచేరీ ఉంటుందన్నారు. 29న విజయవాడకు చెందిన మోదుమూడి సుధాకర్ ఆధ్వర్యంలో గాత్రం కచేరీ, 30న నగరానికి చెందిన మండ సుధారాణి ఆధ్వర్యంలో గాత్ర కచేరీ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 1న తిరునావాయ్ కు చెందిన రమణ బాలచంద్రన్ ఆధ్వర్యంలో వీణ కచేరి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

28న కేవీ ప్రసాద్‌కు సంగీత కళాసాగర బిరుదు: అకాడమీ ఏటా అందజేస్తున్న 'సంగీత కళాసాగర' బిరుదును ఈ ఏడాది చెన్నైకు చెందిన ప్రఖ్యాత మార్దంగికులు (మృదంగ కళాకారుడు) కేవీ ప్రసాద్‌కు ఈ నెల 28న అందజేయనున్నారు. సంగీతాభిలాషులు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరై కళాకారులను ప్రోత్సహించాలని విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి సీఏ చంద్రశేఖర్ వీరఘంట విజ్ఞప్తి చేశారు.